



వేరుశనగకు మద్దతు ధర ఇవ్వడం లేదని అచ్చంపేటలో ఆందోళన చేస్తున్న రైతులు(ఫైల్)

ధరాఘాతం

- వేరుశనగ రైతులను ముంచుతున్న కమీషన్ ఏజెంట్లు
- కొన్ని లాట్లకే రికార్డు ధర.. మిగతా వాటికి అత్యల్ప ధరలు
- ఏజెంట్లకు వత్తాసు పలుకుతున్న మార్కెట్ సెక్రటరీలు
- గేట్ ఎంట్రీలు లేకుండా సెస్ సొమ్ము కాజేత
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడు భారీగా కొనుగోళ్లు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలకు మద్దతు ధర రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే మిర్చి ధర అమాంతం పడిపోగా.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధికంగా సాగుచేసే వేరుశనగకు కూడా ధరలు రావడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో రైతులు వేరుశనగకు మద్దతు ధర ఇవ్వడం లేదని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పల్లీకి నిప్పంటించి ధర్నా చేశారు. అయినా మద్దతు ధర దక్కక పోవడంతో ఆదివారం అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌ను మహిళా రైతులు పంట కుప్పల వద్దకు లాక్కెళ్లారు. వాటిపై కూర్చోబెట్టి ఆమె కొంగు లాగారు. మీద వేరుశనగలు పోశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వేరుశనగ ధరలపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేసింది. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు అనంతపురం తర్వాత అత్యధికంగా వేరుశనగ పంట పండించే జిల్లాగా ఉమ్మడి పాలమూరుకు పేరుంది. నేలల స్వభావం కారణంగా ఇక్కడ పండించే పంటలో అఫ్లోటాక్సిన్ శాతం తక్కువ ఉంటుంది. దాంతో గింజలు ఎక్కువ కాలం నిలువ ఉండి.. ఎగుమతి నాణ్యతను కలిగి ఉంటాయి. అయితే సాగునీటి వనరుల పెరిగిన తర్వాత వేరుశనగకు బదులు రైతుల్లో చాలామంది వరిసాగు వైపు మళ్లారు. అయినప్పటికీ ముందస్తు రబీలో వేరుశనగ పంట ఎక్కువగానే సాగవుతోంది. ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట



వనపర్తి మార్కెట్‌కు భారీగా వచ్చిన వేరుశనగ

జిల్లాల్లో సుమారు 72,123 ఎకరాల్లో ఈ ఏడాది వేరుశనగ పంట సాగైంది. అత్యధికంగా వనపర్తిలో 20,421 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు ముందుగానే ఆగిపోవడంతో.. రైతులు బోరు బావుల ద్వారా స్ప్రింక్లర్ల సాయంతో పంటలను పండిస్తున్నారు. సంప్రదాయంగా వస్తున్న విత్తనాలనే ఎక్కువగా వాడటం, కొత్త వంగడాలు రాకపోవడంతో దిగుబడి కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది. వాస్తవానికి ఇతర జిల్లాల్లో పండిన వేరుశనగ కంటే ఇక్కడ ఉత్పత్తి అయిన పంట కొనేందుకు వ్యాపారుల నుంచి పోటీ ఎక్కువగా ఉంటోంది. ఈ కారణంగా ప్రతీసారి ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లలో రికార్డు స్థాయిల్లో ధరలు నమోదవుతాయి. అత్యల్ప ధర కూడా మద్దతు ధరకు సమీపంలోనే ఉంటుంది. కానీ ఈసారి మాత్రం ధరలు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

72,123 ఎకరాల్లో సాగు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ సారి సుమారు 72,123 ఎకరాల్లో వేరుశనగ సాగైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 10,482 ఎకరాల్లో సాగు కాగా.. అక్టోబరు 2023 నుంచి ఫిబ్రవరి 7, 2024 వరకు జిల్లాలో 2,13,936 క్వింటాళ్ల వేరుశనగ కొనుగోలు చేశారు. ఈ జిల్లా పరిధిలోని మార్కెట్లలో అత్యధికంగా క్వింటాల్‌కు రూ.8,209 ధర పలకగా.. అత్యల్పంగా రూ.3,000 పలికింది. ఈ మార్కెట్‌లో సరాసరిగా రూ.6,377 ధర పలికిందని అధికారులు చెబుతున్నారు.


- వనపర్తి జిల్లాలో 20,421 ఎకరాల్లో వేరుశనగ సాగు కాగా.. మార్కెట్‌లో ఇప్పటివరకు 1,73,726 క్వింటాళ్ల వేరుశనగ కొనుగోలు చేశారు. ఇక్కడ గరిష్ట ధర రూ.8,532 పలుకగా.. కనిష్ట ధర రూ.3,599గా ఉంది. ఈ మార్కెట్ పరిధిలో ఎక్కువ కొనుగోళ్లు జరిగినా.. మార్కెట్ సెస్ ఎగవేత కోసం తక్కువ కొనుగోళ్లు జరిగినట్లు చూపుతున్నారు. 10 వేల ఎకరాలు సాగుచేసిన మహబూబ్‌నగర్ జిల్లాలో 2.13 లక్షల క్వింటాళ్ల కొనుగోలు జరగ్గా.. 20 వేల ఎకరాలకుపైగా సాగైన వనపర్తి జిల్లాలో 1.73 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు.
- గద్వాల జిల్లాలో 16,239 ఎకరాల్లో వేరుశనగ సాగు కాగా.. 1.03 లక్షల క్వింటాళ్ల వేరుశనగను కొనుగోలు చేశారు. అత్యధికంగా రూ.8,454 ధర పలకగా.. అత్యల్పంగా రూ.3,500 ధర పలికింది. నవంబరు, డిసెంబరు నెలల్లో అత్యధిక రేటు పలకగా.. జనవరి నుంచి రేటు తగ్గుతూ వచ్చింది. రూ.3,500 నుంచి రూ.6,000 మధ్యలో సగటు ధర వస్తోంది.
- నారాయణపేట జిల్లాలో 7,981 ఎకరాల్లో పంట సాగు చేయగా.. అక్టోబరు 2023 నుంచి ఇప్పటివరకు 22,698 క్వింటాళ్ల వేరుశనగ కొనుగోలు చేశారు. అత్యధికంగా క్వింటాల్‌కు రూ.7,311 పలకగా.. అత్యల్పంగా రూ.4,850గా పలుకుతోంది. సగటు ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా రూ.6,080గా నమోదైంది.

మార్కెట్లలో మోసాలు..

గతంలో ప్రభుత్వం ధాన్యం సేకరించినప్పుడు కమీషన్ ఏజెంట్లు, రైస్ మిల్లర్లు కొనుగోలు చేసి.. లాభపడేవారు. కానీ కొన్నేళ్లుగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో ఆరుతడి పంటల కొనుగోళ్లలో వ్యాపారులు ముందున్నారు. ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట కీలకం కావడంతో దీనిపై లాభాలను ఆశిస్తున్నారు. సాధారణంగా పంట రాశి శాంపిళ్లు సేకరించి.. అందులో గ్రేడింగ్ చేసి ధరలు నిర్ణయించాలి. కానీ కమీషన్ ఏజెంట్లు కేవలం కుప్పలను చూస్తూ వెళ్తూనే వాటికి ధరలు నిర్ణయిస్తున్నారు. దీనివల్ల కుప్పలో నాణ్యత ఉన్నా.. ధరలు లభించని పరిస్థితులు ఉన్నాయి. అలాగే తరుగు పేరిట, చాట కూలీలు కూడా అధిక మొత్తంలో దోపిడీ చేస్తున్నారు. ఒక్కో కుప్ప వద్ద కనీసం ఒక బస్తా వేరుశనగను రైతు కోల్పోవాల్సి వస్తోంది. దీన్ని చాట కూలీల నుంచి తిరిగి వ్యాపారులు సగం ధరకు తీసుకుంటుండటం గమనార్హం. అలాగే మార్కెట్‌లో రికార్డు ధరలు అని ప్రకటించుకుంటున్న అధికారులు.. కొన్ని లాట్లకు మాత్రమే ఎక్కువ ధర ఇస్తున్నారు. మెజారిటీ రాశులకు అసలు మద్దతు ధర కంటే తక్కువగా ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.18 వేలకు క్వింటాల్ వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులకు.. పంట పండించిన తర్వాత కనీస మద్దతు ధర రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో వనపర్తి మార్కెట్‌లో అత్యధికంగా క్వింటాలుకు రూ.8,532 ధర పలకగా.. మహబూబ్‌నగర్ మార్కెట్‌లో అత్యల్పంగా రూ.3,000లకు కొనుగోలు చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర పథకం కింద రూ.6,377 ధర నిర్ణయించగా.. అంతకంటే తక్కువగానే ధర పలుకడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. అన్ని మార్కెట్లలో గత సంవత్సరం సగటు ధర ఎంఎస్‌పీ కంటే ఎక్కువగా ఉండగా.. ఈ సంవత్సరం మాత్రం సగటు ధర ఎంఎస్‌పీ కంటే చాలా తక్కువగా ఉంది. అలాగే మార్కెట్ల అధికారులు గేట్ ఎంట్రీలు నమోదు చేయకుండా, రైతుల వివరాలు తీయకుండా.. పంట దించిన తర్వాత కమీషన్ ఏజెంట్ల వద్ద కూర్చుని నమోదు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అలాగే సెల్‌ఫోన్ నెంబర్ల స్థానంలో వ్యాపారులవే వేస్తున్నారు. ఈ క్రమంలో మార్కెట్ సెస్‌కు భారీగా గండికొడుతున్నారు. అటు రైతులను, ఇటు ప్రభుత్వాన్ని కూడా మోసం చేస్తున్నారు. ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ప్రజాప్రతినిధులు కూడా మార్కెట్లపై పెద్దగా దృష్టి సారించలేదు. అలాగే మార్కెట్ కమిటీల చైర్మన్లు కూడా లేకపోవడంతో ఆడిందే ఆట పాడిందే పాటగా పరిస్థితి తయారైంది.

పాలమూరు పురపీఠం హస్తగతం

- ఫలించిన కాంగ్రెస్ వ్యూహం..
- చక్రం తిప్పిన ఎమ్మెల్యే యెన్నం
- చైర్మన్‌గా ఆనంద్‌గౌడ్.. వైస్ చైర్మన్‌గా షబ్బీర్‌అహ్మద్
- ఆనంద్‌కు 33 ఓట్లు.. షబ్బీర్‌కు 30 ఓట్లు
- బీఆర్ఎస్ చైర్మన్.. వైస్ చైర్మన్ అభ్యర్థులకు చెరో 14
- తటస్థంగా బీజేపీ



చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపాలిటీ అయిన పాలమూరు పురపాలికను కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను గద్దె దించిన కాంగ్రెస్ తమ పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్‌లను గెలిపించుకుని అవిశ్వాస ఎపిసోడ్‌ను విజయవంతంగా ముగించింది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి తేరుకోకముందే బీఆర్ఎస్‌కు మునిసిపాలిటీ రూపంలో మరో గట్టి ఎదురుదెబ్బ తగలింది. మునిసిపాలిటీలో 36 మంది సభ్యుల బలం ఉన్న ఆ పార్టీ నుంచి 22 మంది చీలిపోయి, కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం పెద్ద షాక్ అనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాలమూరు పురపాలికపై అవిశ్వాస అస్త్రం ప్రయోగించారు. తమ పార్టీకి బలం లేకపోయిన ప్రతిపక్షాల మద్దతు, బీఆర్ఎస్‌లో ఉన్న అసంతృప్తులను తమవైపు తిప్పుకుని చైర్మన్, వైస్ చైర్మన్‌లను గెలిపించుకుని ప్రత్యర్థులకు షాకిచ్చారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సోమవారం మునిసిపల్ సమావేశ మందిరంలో అడిషినల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 49 మంది సభ్యులు, ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో ఓటు కలిపి 50 మంది సభ్యులుండగా.. కాంగ్రెస్ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి అలుగొండ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు మద్దతుగా 33 మంది సభ్యులు చేతులెత్తారు. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి కోరమోని వనజకు 14 మంది సభ్యులు మద్దతు తెలిపారు. ముగ్గురు సభ్యుల బలం ఉన్న బీజేపీ తటస్థంగా ఉండిపోయింది. ఆ తరువాత వైస్ చైర్మన్ అభ్యర్థిగా షబ్బీర్ అహ్మద్‌ను కాంగ్రెస్ ప్రతిపాదించగా, ఆయనకు 30 మంది సభ్యులు మద్దతు తెలుపగా, బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన రావు అనంతరెడ్డికి 14 మంది అనుకూలంగా ఓటు వేశారు. దీంతో చైర్మన్‌గా ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా షబ్బీర్‌అహ్మద్ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

వైస్ చైర్మన్ పదవి కోసం చివరి వరకు ఉత్కంఠ

వైస్ చైర్మన్ స్థానం కోసం చివరి వరకు పోటీ నెలకొంది. కాంగ్రెస్ మైనారిటీలకు వైస్ చైర్మన్ ఇవ్వాలని నిర్ణయించగా, ఆ పార్టీ నుంచి ముగ్గురు పోటీపడ్డారు. షబ్బీర్‌అలీ, మోయిన్‌అలీ, షేక్‌ఉమర్ మధ్య తీవ్ర పోటీ ఉండటంతో వారిని నచ్చజెప్పేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. చైర్మన్ ఎన్నిక అనంతరం గంట బ్రేక్ ఇవ్వగా.. ఆలోగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కౌన్సిలర్లతో చర్చించారు. మోయిన్‌అలీని తప్పించినా షబ్బీర్, ఉమర్ మధ్య గట్టిపోటీ నెలకొంది. చివరకు ఉమర్‌ను ఎంపిక చేస్తారని భావించినా అనూహ్యంగా షబ్బీర్‌ను ఫైనల్ చేశారు. షబ్బీర్ పేరు ప్రతిపాదించగానే ఉమర్ కౌన్సిల్ హాల్ నుంచి లేచి వెళ్లిపోయారు. వైస్ చైర్మన్ ఎన్నికకు ఇద్దరు సభ్యులు హాజరు కాలేదు. దీంతో 30 మంది షబ్బీర్‌కు అనుకూలంగా ఓటు వేశారు.

ఎన్నికైన వెంటనే ప్రమాణ స్వీకారం

ఎన్నికైన వెంటనే ఆనంద్‌కుమార్ గౌడ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత వైస్ చైర్మన్‌గా ఎన్నికైన వెంటనే షబ్బీర్‌అలీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. తర్వాత ఎమ్మెల్యే, కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డిలు ఆయన చాంబర్ కుర్చీలో కూర్చోబెట్టారు. వైస్ చైర్మన్‌ను కూడా ఆయన కుర్చీలో కూర్చోబెట్టారు.



వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్

కోరమోని వనజ మరో'సారి'

కోరమోని వనజ మునిసిపల్ చైర్‌పర్సన్ కావాలన్నా కోరిక నెరవేరడం లేదు. 2014లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఆమె చైర్మన్‌గా బరిలో నిలిచింది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండటంతో గట్టి పోటీనిచ్చినా రెండు ఓట్ల తేడాతో చైర్మన్ పీఠం కోల్పోవాల్సి వచ్చింది. 2019లోనూ చైర్మన్ కావాలని ఆశించారు. ఆమె తన వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికవడంతో అంతా ఆమే చైర్‌పర్సన్ అవుతుందని భావించారు. పార్టీకి ఫుల్ మెజారిటీ రాగా.. అనూహ్యంగా కోరమోని నర్సింహులును చైర్మన్ చేశారు. తాజాగా అవిశ్వాస తీర్మానంతో బీఆర్ఎస్ చైర్మన్ తన పదవిని కోల్పోగా.. తర్వాత పార్టీ ఆమెను చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించినా మూడోసారీ నిరాశే ఎదురైంది.



ఎన్నికకు హాజరైన సభ్యులు

అన్ని వార్డులకు సమ ప్రాధాన్యం: యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు పురపాలికలో ప్రజాపాలన మొదలుకాబోతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాలుగేళ్ల సమయం వృథా అయ్యిందని, ఈ ఏడాది అన్ని వార్డులను సమప్రాధాన్యతతో అభివృద్ధి చేసుకుంటామని చెప్పారు. మురికివాడలుండి అభివృద్ధికి నోచుకోలేని చోట వాటిపై అదనపు దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికైన ఆనంద్, షబ్బీర్‌లకు పట్టణంపై, పట్టణ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. వారిద్దరూ పట్టణాన్ని అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. గతంలో బీఆర్ఎస్ రూ.100 కోట్లు తెచ్చామని చెబుతున్నా.. ఏ నిధులు లేవని అదంతా భ్రమ అని చెప్పారు. కొందరు చైర్మన్ ఎన్నికపై కోర్టులకు వెళ్లడంపై స్పందిస్తూ.. ఇది ప్రజాస్వామ్యమని, ఎవరు ఎక్కడికైనా వెళ్లొచ్చని, వాటిని క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అందరి అభిప్రాయంతో పారదర్శకంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో పాలమూరు పురపాలిక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మునిసిపాలిటీకి రావలసిన బకాయిలను వసూలు చేసి, ప్రభుత్వం, ఎమ్మెల్యే నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు.

లీకేజీలను అరికట్టేదెన్నడు?

- ర్యాలంపాడు రిజర్వాయర్ కట్టకు మరమ్మతులు కరువు
- లీక్‌లతో రిజర్వాయర్ సామర్థ్యం 4 నుంచి 2 టీఎంసీలకు కుదింపు
- కట్ట రివిట్‌మెంట్ తొలగించి పనులు చేపట్టాలని కమిటీ నివేదిక
- లక్ష ఎకరాల నుంచి ఐదు వేలకు తగ్గిన సాగు



ర్యాలంపాడు రిజర్వాయర్

గద్వాల, ఫిబ్రవరి 12: నెట్టెంపాడు ప్రాజెక్టులో ర్యాలంపాడు రిజర్వాయర్ గుండెకాయలాంటిది. మొత్తం ప్రాజెక్టు స్థిరీకరించిన ఆయకట్టు రెండు లక్షలు కాగా, ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారానే 1.37 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలి. అంతేకాకుండా ఐదు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లను కూడా దీని ద్వారానే నింపాల్సి ఉంటుంది. అంత కీలకమైన ఈ రిజర్వాయర్‌కు లీకేజీల సమస్య రావడంతో 4.20 టీఎంసీ సామర్థ్యం నుంచి రెండు టీఎంసీలకే పరిమితం చేశారు. అప్పటి నుంచి సాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదు.

2020 నుంచి లీకేజీ సమస్య

నెట్టెంపాడు ప్రాజెక్టులో లిఫ్ట్-1 గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కాగా, లిఫ్ట్-2 ర్యాలంపాడు రిజర్వాయర్. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యం 4.20 టీఎంసీలు. దీని కింద ఉన్న ఐదు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ల సామర్థ్యం ఆరు టీఎంసీలు. ర్యాలంపాడు కింద 1.37 లక్షల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది. ధరూర్, గట్టు, మల్దకల్, అయిజ, ఇటిక్యాల మండలాలకు సాగునీరు అందాల్సి ఉంది. 2012 నుంచి 2020 వరకు నిరాటంకంగా సాగునీరు అందింది. 2020లో ర్యాలంపాడు రిజర్వాయర్‌కు లీకేజీల సమస్య మొదలైంది. 2021 నాటికి మరింత పెరిగి రిజర్వాయర్ కట్టపై ఒత్తిడి పెరిగింది. దీంతో 2021 అక్టోబరులో సాంకేతిక నిపుణులు పరిశీలించి రిజర్వాయర్ సామర్థ్యాన్ని రెండు టీఎంసీలకు తగ్గించింది. అనంతరం లీకేజీలను అరికట్టేందుకు కమిటీ వేశారు. వారు 2022 సెప్టెంబరులో నివేదిక ఇచ్చారు. ఇందుకు రూ.93 లక్షలు ఖర్చు చేశారు. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం రిజర్వాయర్ కట్ట రివిట్‌మెంట్ తొలగించి, సాంకేతికతో కూడిన షీట్‌లు వేసి, గ్రావెల్ నింపి మళ్లీ కాంక్రీట్‌తో రివిట్‌మెంట్ పర్చాలని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే నివేదిక ఇచ్చి ఏడాదిన్నర గడిచినా.. సమస్య పరిష్కారంలో ముందడుగు పడటం లేదు. పనులు ప్రారంభించి పూర్తి చేయాలంటే మరో రెండేళ్లు పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని రైతులు అంటున్నారు.

సాగునీటికి కష్టకాలం

ర్యాలంపాడు రిజర్వాయర్‌ను రెండు టీఎంసీలకు పరిమితం చేయడంతో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 1.37 లక్షల ఎకరాలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. చివరి ఆయకట్టు నీరు రాక రైతులు అవస్థలు పడుతున్నారు. కృష్ణానదికి వరదలు ఉన్నప్పుడే రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసుకోవాల్సి ఉంది. ఖరీఫ్‌లో పంటలు గట్టెక్కినా.. రబీలో నీరందడం లేదు. దాంతో రైతులు రెండేళ్లుగా రబీలో సాగు అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. రిజర్వాయర్ కింద 2012 నుంచి 2020 వరకు నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేయగా, అప్పట్లో రబీలో లక్ష ఎకరాలకు వరకు సాగునీరు ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఐఏబీ సమావేశంలో అధికారులు సూచించిన ప్రకారం ఈ సారి ఐదు వేల ఎకరాల్లో మాత్రమే ఆరుతడి పంటలు వేశారు.

గట్టు ఎత్తిపోతలకూ ర్యాలంపాడే ఆధారం

కరువు పీడిత ప్రాంతమైన గట్టు, కేటీదొడ్డి మండలాలను సస్యశ్యామలం చేసేందుకు నిర్మిస్తున్న గట్టు ఎత్తిపోతల పథకానికీ ర్యాలంపాడు రిజర్వాయరే ఆధారం. ర్యాలంపాడు నుంచి 2.80 టీఎంసీలను ఎత్తిపోసి, 33 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందుకోసం గజ్జలమ్మ గుట్ట దగ్గర 1.32 టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇంతటి కీలకమైన ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల సమస్యతో కొట్టుమిట్టాడుతుంటే మొత్తం మొత్తం ప్రాజెక్టుపైనే ప్రభావంపడే పరిస్థితి ఉంది. ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



నీరు లీక్ అవుతున్న కట్ట ఇదే..

నివేదికపై అధ్యయనం చేస్తున్నారు

కట్ట లీకేజీలకు సంబంధించి కమిటీ ఇచ్చిన నివేదికపై అధ్యయనం జరుగుతోంది. నివేదికలో సూచించిన అంశాలు, చేయాల్సిన పనులు, ఇలా ఎక్కడైన ప్రాజెక్టులు, రిజర్వాయర్‌లలో చేశారా? అనేది పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత పూర్తి నివేదికతో అంచనాలు వేసి ప్రతిపాదనలు తయారు చేస్తారు. ప్రస్తుతం అధికారుల దృష్టంతా దీనిపైనే ఉంది.

- వెంకటేశ్వర్‌రావు, ఈఈ పీజేపీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ANDHRA JYOTHI CLASSIFIEDS
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

డాక్యుమెంట్ పోయినది

నేను పి. లక్ష్మినారాయణ తండ్రి శంకరయ్య, R/O ఇ.నెం.9-1-80, తిమ్మసానిపల్లి గ్రా., మహబూబ్‌నగర్ జిల్లా, TS. గృహోపకరణాలను ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి మార్చేటప్పుడు నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.2860/2014 (సర్వే నం. 82) తో పాటు లింక్ డాక్యుమెంట్స్ పోయినవి. ఎవరికైనా దొరికితే ఈ క్రింది నంబరుకు సంప్రదించగలరు. సెల్:9666646777
AJJ:N

ANDHRA JYOTHI CLASSIFIEDS
3+1 Scheme
200/-
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 12 : ప్రజావాణికి వచ్చే ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మంది రంలో కలెక్టర్ శ్రీహర్ష ఫిర్యాదుదారుల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్జీలను పెండింగ్‌లో ఉంచ కుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్‌లోంచి పడి యువతికి గాయాలు

- కృష్ణ మండల కేంద్రంలోని మల్లమ్మ రైల్వే గేట్ దగ్గర ఘటన

కృష్ణ, ఫిబ్రవరి 12 : రైలులో నుంచి ఓ యువతి కింద పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని మల్లమ్మ రైల్వే గేట్ దగ్గర సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ముంబాయికి చెందిన డ్యాన్ని, ఐషు, ఫరేక ముగ్గురు యువతులు కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కేంద్రంలో జరిగే ఓ పెళ్లి వేడుకలో డెకరేషన్ కోసం ఆదివారం రాత్రి ముంబాయిలో నగర్‌కోల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఏడు గంటలకు ఫరేక అనే యువతి డోర్ దగ్గర నిలబడి బ్రెష్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడింది. తోటి స్నేహితులు ఎమర్జెన్సీ చైన్ లాగి రైలును ఆపారు. ఈ ఘటనలో ఫరేక తలకు బలమైన గాయం కావడంతో పాటు కుడి చేయి విరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సతీష్ అక్కడికి చేరుకొని గాయపడిన యువతిని ఆటోలో కృష్ణ మండల కేంద్రానికి తరలించి, అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా రాయచూరు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
కల్వకుర్తి : 9985403252
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

కుక్కల దాడిలో 42 గొర్రె పిల్లలు మృతి

ఉండవల్లి, ఫిబ్రవరి 12 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో ఊర కుక్కలు దాడి చేసి 42 గొర్రె పిల్లలను చంపేశాయి. బాధితుడు కాశీపురం ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోజు మాదిరిగానే 70 చిన్న గొర్రె పిల్లలను ప్రత్యేకంగా కంచెలో ఉంచి, గొర్రెలను మేపుకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఆ గొర్రె పిల్లలపై ఊర కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి వాటిని వెళ్లే గొట్టే ప్రయత్నం చేసినా పలితం లేకపోయింది. అప్పటికే 42 గొర్రె పిల్లలు చనిపోగా, మరో 20 పిల్లలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెండున్నర లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు.

వరుస దుకాణాలలో చోరీలు

రాజాపూర్, ఫిబ్రవరి 12 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని వరుస దుకాణాలలో ఆదివారం అర్ధరాత్రి తరువాత చోరీలు జరిగాయి. రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. 44వ నెంబరు జాతీయరహదారి, రాజాపూర్ మండల కేంద్రంలో ఉన్న శ్రీరామ ఆటో ఫైనాన్స్‌లో షటర్‌ను సగానికి పైగా తెరిచి, బీరువాలో ఉంచిన రూ.42వేలు చోరీ అయ్యాయని ఫైనాన్స్ మేనేజర్ కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే హెయిర్‌సెలూన్ దుకాణం తాళాలు పగులగొట్టి, దుకాణంలో ఉంచిన రూ.5వేలు దొంగిలించారు. అలాగే మెడికల్ దుకాణం తాళాలు పగులగొట్టి, చోరీకి యత్నించారని తెలిపారు. చోరీ జరిగిన స్థలాల్లో క్లూస్ టీంతో విచారణ చేపట్టి, వేలిముద్రలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు దిగుతుండగా జారిపడిన రూ.లక్ష నగదు

- సీసీ ఫుటేజీలో మహిళకు లభించినట్లు ఆధారాలు



గుర్తుతెలియన వ్యక్తి డబ్బులను తీసుకుంటున్నట్లు సీసీ టీవీలో రికార్డు అయిన దృశ్యం

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 12: ఆర్టీసీ బస్సు దిగుతుండగా రూ.లక్ష జారిపడిపోగా, ఓ మహిళ ఆ నగదును తీసుకున్నట్లు సీసీ ఫుటేజీలో కనిపించిన సంఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో చోటుచేసుకుంది. బాధితుడు మూడావత్ చోక్లా తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా బొగ్గులదోన గ్రామానికి చెందిన అతను బ్యాంకులో రుణం చెల్లించేందుకు అచ్చంపేటకు ఆర్టీసీ బస్సులో వచ్చాడు. బస్‌స్టాండ్ సమీపంలో దిగిపోయాడు. డబ్బులు కనిపించకపోవడంతో స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. బస్‌స్టాండ్ సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా, గుర్తుతెలియని మహిళ డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. ఆమెను గుర్తించేందుకు చూస్తున్నామన్నారు.


A VI ANAND FANTASY
From the Director of
ఈనెల 16న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

సంగీత 70 - ఆర్.సి.పురం | ఈశ్వర్ 70 - అత్తాపూర్
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ | శివశక్తి 70 ఎంఎం - కాప్రా
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ | శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి
వెంకటరమణ పద్మావతి - కాచిగూడ | మహాలక్ష్మి 70 ఎ/సి - కొత్తపేట
ముక్త 35 ఎంఎం ఎ/సి - ఆబిడ్స్ | SV సినీప్లెక్స్ 70 - పటాన్‌చెరు
తారకరామ 70 ఎ/సి - కాచిగూడ | వర్తక్ 70 ఎ/సి - అల్వాల్
విశ్వనాథ్ ఎ/సి - కూకట్‌పల్లి | వైజయంతి 70 ఎ/సి - నాచారం
భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి | సాయిరంగ 70 ఎ/సి - మియాపూర్
లక్ష్మీకళ సినిప్లెడ్ - మూసాపేట్ | BR హైటెక్ - మాదాపూర్
శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ | సూపర్ 70 ఎ/సి - బాలాపూర్
ప్రశాంత్ ఎ/సి - సికింద్రాబాద్ | శ్రీ ప్రేమ 70 ఎ/సి - తుక్కుగూడ
తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ | స్వప్న 70 ఎ/సి - కాటేదాన్
సంపూర్ణ 70ఎంఎం - వనస్థలిపురం | శ్రీ రమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట
భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల | సంతోష్ 70 - ఇబ్రహీంపట్నం
గోకుల్ 70 ఎ/సి - ఎర్రగడ్డ | గణేష్ 70 ఎ/సి - శంషాబాద్
శ్రీదేవి 70 ఎ/సి - చిలకలగూడ | ముకుంద్ 70 - మేడ్చల్
శ్రీ కృష్ణ 70 ఎ/సి - ఉప్పల్

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
మేఘా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ | మల్లికార్జున 70 ఎ/సి - కూకట్‌పల్లి
శ్రీరమణ 35- అంబర్‌పేట్ | సాయిపూజ 70 - సూరారం
GLOBAL CINEMAS LLP

ఈనెల 16న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినిప్లెడ్ ఎ/సి - మూసాపేట్
SKML MOTION PICTURES (GANESH BHARI) 9296509333

BLASTING BLOCKBUSTER నేడే చూడండి




సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
అరుణ్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30 | తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,2.15,6.00,9.00
GLOBAL CINEMAS LLP

వాలెంటైన్స్ డే శుభాకాంక్షలతో
రేపే బ్రహ్మాండమైన విడుదల



ఈనెల 16న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
శ్రీకృష్ణ 70 ఎంఎం ఎ/సి - అలియాబాద్
BHAVANI FILMS 9848028739

వాలెంటైన్స్ డే స్పెషల్
రేపే బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
8.00,11.15,2.30,6.00,9.30
SRIMATHA CREATIONS RELEASE 9396820630



సప్తగిరి 70 ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 10.45,2.00,5.45,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
వెంకటరమణ/పద్మావతి - కాచిగూడ 2.45,6.15 | భ్రమరాంబ - కూకట్‌పల్లి 11.30,6.30 | తాళ్ళూరి - ఇసిఐఎల్ 2.15,9.15
శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 2.30,9.30 | ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,6.05 | విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00
సంపూర్ణ - వనస్థలిపురం 11.00,6.00 | లక్ష్మీ - శంషాబాద్ 1.30,2.30,6.00,9.00 | నర్తకి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30

జాతీయ కరాటే పోటీల్లో మండల విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 12 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో మండలానికి చెందిన 31 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో 20 మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్ గెలుచుకోగా, మిగతావారు సిల్వర్, బ్రౌన్ బెల్ట్ గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను కరాటే మాస్టర్లు, గ్రామస్థులు అభినందించారు.

సోలార్ ప్లాంట్‌లో విద్యుదాఘాతం

- ఎగిసిపడిన మంటలు

-రూ 10లక్షల మేర ఆస్తి నష్టం



మంటలు చెలరేగుతున్న దృశ్యం

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 12: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామ సమీపంలో సోలార్ ప్లాంట్‌లో సోమవారం చోటుచేసుకుంది. సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించి మంటలు అదుపుచేసే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాకపోడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందచేశాం. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పి అదుపులోకి తెచ్చారు. విద్యుదాఘాతంతో దాదాపు రూ. 10లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.

రెండు గుడిసెలు దగ్ధం

పాన్‌గల్, ఫిబ్రవరి 12 : షార్ట్ సర్క్యూట్‌తో రెండు నివాస గుడిసెలు దగ్ధమైన ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిమండ్ల, ఎల్లస్వామిలు టీసీ ప్లాట్‌లలో తమకు చెందిన స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. బాధితులు సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం గుడిసెలకు తాళాలు వేసి వెళ్లగా మధ్యాహ్నా సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకొని సాయికి చెందిన గుడిసె పూర్తిగా దగ్ధం కాగా, ఎల్లస్వామికి చెందిన గుడిసె పాక్షికంగా దగ్ధమైంది. సాయి గుడిసెలో బియ్యం, రూ.10 వేల నగదు, టీవీ, వంట సామగ్రి, దుస్తులు, బీరువా పూర్తిగా దగ్ధం కాగా వాటి విలువ రూ.రెండు లక్షల 20వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఎల్లస్వామికి చెందిన గుడిసెలో ఫ్యాను, తలుపులు, సామగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. వాటి విలువ రూ.20వేలు ఉంటుందన్నారు. ఘటనా స్థలాన్ని ఆర్‌ఐ మహేష్ పరిశీలించి, పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

నారాయణపేట, ఫిబ్రవరి 12 : దివ్యాంగురాలిపై అత్యాచారం కేసులో ఓ నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా ధన్వాడ పీఎస్ పరిధిలోని దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన కేసులో బాధ్యుడు ధన్వాడకు చెందిన కావలి కరుణాకర్‌కు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.51 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఎస్పీ కథనం ప్రకారం.. దివ్యాంగురాలికి బాధ్యుడు మాయ మాటలు చెప్పి అత్యాచారం చేయగా గర్భవతి అయ్యిందని సోదరుడు ఇచ్చిన దరఖాస్తుపై అప్పటి ఎస్‌ఐ కృష్ణయ్య ఎఫ్‌ఐఆర్ నమోదు చేయగా, సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణ చేపట్టి చార్జ్‌షీట్ నమోదు చేశారు. సంబంధిత అధికారులు కేసు విచారణ చేపట్టి 12మంది సాక్షులను కోర్టులో హాజరు పరచగా నిందితుడికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. ఈ మేరకు నిందితుడికి జైలు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించి, త్వరలోనే క్యాష్ రివార్డు, ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలు శిక్ష

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 12 : మద్యం తాగి వాహనం నడిపిన 12 మందికి జైలుశిక్ష విధిస్తూ అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కవిత తీర్పునిచ్చారు. అలంపూర్ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల మద్యంతాగి వాహనం నడుపుతూ 20 మంది పట్టుబడినట్లు తెలిపారు. వారిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టారు. వారిలో 12 మందికి రెండు వేల చొప్పున జరిమానా, మరో ఎనిమిది మందికి రెండు వేల చొప్పున జరిమానా, వారిలో నలుగురికి రెండు రోజులు, ఇద్దరికి మూడు రోజులు, ఒకరికి నాలుగు రోజులు, మరొకరికి ఒక రోజు జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు నిచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్

● ఈ నెల 16న పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 12 : ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ ఏడాది విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు ఉండేవి. కానీ, ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది విద్యార్థుకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనుంది. ఈ పరీక్ష కూడా ఈ ఏడాది నుంచే నిర్వహించనున్నారు. అన్ని గ్రూప్‌ల విద్యార్థులు ఈ ప్రాక్టిల్‌కు హాజరుకావాల్సిందే. విద్యార్థుల్లో ఆంగ్లనైపుణ్యాలను, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం సమయత్తం అయింది. ఇందుకుగాను ఈనెల 16న పరీక్షను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొదటి ఏడాది విద్యార్థులు మొత్తం 35 వేల మంది హాజరుకానున్నారు. ఇప్పటికే విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లు కూడా వచ్చాయి. విద్యార్థులు చదువుతున్న కళాశాలలో తప్పనిసరిగా ఈ పరీక్ష రాయాలి. అక్కడి ఇంగ్లిష్ అధ్యాపకుడే మార్కులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని మహబూబ్‌నగర్ డీఐఈవో శ్రీధర్ తెలిపారు.

వసంత పంచమి వేడుకలకు సర్వం సిద్ధం

- చలువ పందిళ్లు, క్యూలైన్ల ఏర్పాటు

- రేపు జోగులాంబ అమ్మవారి నిజరూప దర్శనం



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 12 : వసంత పంచమి ఉత్సవాలకు అలంపూర్ క్షేత్రంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 10 వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా వసంతపంచమిని పురస్కరించుకొని ఈ నెల 14న రేపు బుధవారం వసంతపంచమి సందర్భంగా అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనమివ్వనున్నారు. పంచమినాడు ఉదయం తొమ్మిది గంటలకు యాగశాలలో నిత్య హోమాలు, మహాపూర్ణహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘటాలకు ఆవహన, అర్చన, అనంతరం మూలమూర్తి అమ్మవారికి అవబృదస్నపనము, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించనున్నారు.

ఏడాదికోసారి నిజరూప దర్శనం

క్షేత్రంలో కొలువుదీరిన జోగుళాంబ అమ్మవారు ఏడాదికోసారి మాత్రమే భక్తులకు నిజరూప దర్శనం ఇస్తారు. వసంతి పంచమి సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి దాదాపు 30 వేల మంది భక్తులు రానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వనపర్తి, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, నంద్యాల, నందికొట్కూరు, ఆదోని తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. ప్రస్తుతం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చినందున రద్దీ మరింత ఎక్కువయ్యే అవకాశముంది. వారితో పాటు శివస్వాములు కూడా అమ్మవారి సేవలో పాల్గొంటారని ఈవో తెలిపారు.

పూర్తయిన ఏర్పాట్లు

వసంతపంచమి వేడుకలకు తరలివచ్చే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయం ఆవరణలో స్వామివారి ముఖద్వారం వద్ద చలువపందిళ్లు వేయించారు. అక్కడి నుండి స్వామివారి ఆలయం వరకు, అలాగే అన్నదాన సత్రం, అమ్మవారి ఆలయం వరకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రముఖులు, సాధారణ భక్తులు, కలశాలు, బోనాలతో వచ్చే వారికి వేర్వేరుగా క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 25 మందికి, జోగుళాంబబాలబ్రహ్మేశ్వర స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో ఆరువేల మంది భక్తులు, శివస్వాములకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తుల సంఖ్య పెరుగుతోంది



పురేందర్‌కుమార్, ఈవో : అమ్మవారి వార్షికోత్సవానికి ఏడాదికేడాది భక్తుల సంఖ్య పెరుగుతోంది. గతం కంటే ఈ ఏడు భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే ఆవకాశం ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాకీటాకీల ద్వార ఏప్పటికప్పుడు మానిటారింగ్ చేస్తాం. అప్పటికప్పుడు ఆవసరమైన ఏర్పాట్లు కూడా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం.

కేంద్రంలో బీజేపీదే అధికారం

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ పార్లమెంటు సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి

మక్తల్, ఫిబ్రవరి 12 : కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆ పార్టీ మాజీ పార్లమెంటు సభ్యుడు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జలంధర్ రెడ్డితో కలిసి, మాట్లాడారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400 పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత 2014 నుంచి 2024 వరకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ముఖ్యంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు హటక్ నుంచి కటక్ వరకు జాతీయ రహదారులు నిర్మించిన ఘనత బీజేపీదే అన్నారు. అన్ని మతాల వారిని గౌరవించి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్లమెంటు సమావేశాల్లో బీజేపీకి 400లకు పైగా సీట్లు వస్తాయని చెప్పడాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రపంచంలో భారత ఆర్థిక మూడవ స్థానంలో ఉందన్నారు. గత ప్రభుత్వాల పాలన వల్ల ఆర్థికంగా ఎంతో వెనుకబడిందన్నారు. ఈ నెల 20న కృష్ణ మండలం నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తారన్నారు. ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని మోదీకి మద్దతు తెలిపి అత్యధిక సీట్లలో గెలిపించాలన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో టిక్కెట్‌ను పార్టీ అధిష్టానం ఎవరికి కేటాయించినా పార్టీ కోసం పనిచేస్తానన్నారు. పార్టీలో నిబద్ధత గల కార్యకర్తలు, నాయకులు ఉన్నారని, పార్టీ అదిష్టానం టిక్కెట్ ఎవరికి ఇచ్చినా అందరం కలిసి పనిచేసి అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పడాకుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్నిస్వామి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు వెంకట్రాములు, చీరాల సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

వేళలు పాటించని వైద్య సిబ్బంది

- ఇబ్బందులు పడుతున్న రోగులు

- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



ఎద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కోసం ఎదురుచూస్తున్న లక్ష్మమ్మ

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 12 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్య సిబ్బంది వేళలు పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్య సిబ్బంది ప్రతిరోజు వేళలు పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరు కావడంతో చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు స్టాఫ్‌నర్సు, ఒక ఫార్మాసిస్టు, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. రోజు వైద్య సిబ్బంది వేళలు పాటించకపోవడం వలన చికిత్స కోసం వచ్చే రోగులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. చివరకు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఇబ్బందులకు గురవుతున్నట్లు రోగులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

- బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న మహిళలు



కొల్లాపూర్‌లో బోనాలతో మొక్కులు తీర్చుకునేందుకు వెళ్తున్న మహిళలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 12 : పోచమ్మ బోనాలను కొల్లాపూర్ పట్టణంలో సోమవారం సాయంత్రం మహిళలు ఘనంగా నిర్వహించారు. తమ నివాస గృహాల నుంచి బోనాలను తీసుకుని ర్యాలీగా పోచమ్మ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో సమీపంలో ఉన్న పోచమ్మ ఆలయం వద్ద మహిళలతో కిక్కిరిశారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకుని నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల సమీపంలో ఉన్న పోచమ్మ ఆలయం వద్ద పెద్దబావి సమీపంలో ఉన్న పోచమ్మ ఆలయం వద్ద పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. వరిదెల కొల్లాపూర్‌లకు చెందిన రైతులు, మహిళలు పోచమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. నేడు ఈదమ్మ బోనాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కొల్లాపూర్ రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో ఈదమ్మ ఆలయం వద్ద బోనాలు సమర్పించేందుకు వచ్చే మహిళలకు రైతు కమిటీ ఆధ్వర్యంలో అన్ని వసతులు కల్పించనున్నారు. వచ్చే మంగళవారం ఈదమ్మ సిడే మహోత్సవం నిర్వహించనున్నారు.



చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న సంపత్‌కుమార్

కొనసాగుతున్న ఉత్సవాలు

పెబ్బేరురూరల్: వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో చౌడేశ్వరిదేవి జాతర ఉత్సవాలు మూడో రోజు కొనసాగుతున్నాయి. చిన్న చౌడేశ్వరిదేవి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుంటున్నారు. సోమవారం ఏఐసీసీ సంపత్‌కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఏర్పడిన మిఠాయి, గాజు దుకాణాలు, ప్లాస్టిక్ షాపుల వద్ద చిన్నారులు, మహిళల సందడి కన్పించింది.

వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, రంజిత్‌కుమార్, షకీల్, సాయికుమార్‌గౌడ్, శివ, వెంకట్‌రాములు, రాములుయాదవ్ ఆలయాన్ని దర్శించుకున్నారు.

ఎక్సైజ్‌శాఖలో ఎన్నికల బదిలీలు

- ఉమ్మడి జిల్లాలో 22 మంది సీఐలు.. ఎనిమిది మంది ఎస్సైలకు స్థానభ్రంశం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్సైజ్‌శాఖలో సీఐ, ఎస్సైలు అధిక సంఖ్యలో బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఒకే ఈఎస్ పరిధిలో మూడేళ్లుగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి పాలమూరులో 22 మంది ఎక్సైజ్ సీఐ, 8 మంది ఎస్సైలకు స్థానభ్రంశం జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు బదిలీలు చేశారు. బదిలీ అయిన ఎస్సైలలో మహ బూబ్‌నగర్ సర్కిల్ ఎస్సై బి శ్రీనివాస్‌ను జహీరాబాద్‌కు, కొత్తకోట ఎస్సై జి.సుధాకర్‌రెడ్డిని మహబూబ్‌నగర్ సర్కిల్‌కు, ఎల్. హన్మంతును మహేశ్వరం నుంచి కొల్లాపూర్‌కు, డి.దామోదర్‌ను హైదరాబాద్‌నుంచి గద్వాలకు, ఎస్.రమేశ్‌బాబును ముషీరాబాద్‌నుంచి కొత్తకోటకు, ఆర్ సతీష్‌కుమార్‌ను ఇబ్రహీంపట్నం నుంచి ఆత్మకూర్‌కు, కెఎం విశ్వనాథంను మెదక్‌నుంచి డీటీఎఫ్ వనపర్తికి, ఇబ్రహీం రజాను కొల్లాపూర్‌నుంచి బీఎంపిపి జహీరాబాద్‌కు బదిలీ చేశారు.

అలాగే సీఐలు పటేల్ బానోతు గద్వాల నుంచి ఎస్‌హెచ్‌ఓ అమీర్‌పేటకు, జి గోపాల్‌నుగద్వాల నుంచి దూల్‌పేట-2, ఏ బాలరాజును ఆత్మకూర్ నుంచి రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, బి ఓంకార్ కొత్తకోట నుంచి ఉప్పల్‌కు, ఎం ఆశోక్‌కుమార్‌ను జహీరాబాద్ నుంచి నారాయణపేటకు, కె.విష్ణువరెడ్డిను నాచారం నుంచి జడ్చర్లకు, కె బాలక్రిష్ణారెడ్డిను రాజాపూర్ నుంచి మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, వి.వెంకటేశ్వర్‌రెడ్డిని నల్గొండ నుంచి మ.నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, జి.శారద గొల్కొండ నుంచి మ.నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, జి.కళ్యాణ్ క్రిష్ణ నుంచి నాగర్‌కర్నూల్ ఎస్‌హెచ్‌వోకు, బి.నాగిరెడ్డి భొన్‌గిర్ నుంచి కొల్లాపూర్ ఎస్‌హెచ్‌వోకు, ఏ శివజ్యోతి డీటీఎఫ్ సికింద్రాబాద్ నుంచి కల్వకుర్తి ఎస్‌హెచ్‌వోకు, బి అనంతయ్య తాడూర్‌నుంచి డీటీఎఫ్ నాగర్‌కర్నూల్, ఏ గణపతిరెడ్డి ఎన్‌ఫోర్స్ మ.నగర్ నుంచి గద్వాల ఎస్‌హెచ్‌వోకు, కె సైదిరెడ్డి అమీర్‌పేట నుంచి డీటీఎఫ్ గద్వాలకు, కె కరుణ టీడీఎఫ్ హైదరాబాద్ నుంచి కొత్తకోట ఎస్‌హెచ్‌వో, ఎం శంకర్ కల్వకుర్తి నుంచి కోదాడ, కె పరమేశ్వర్‌గౌడ్‌డీటీఎఫ్ నాగర్ కర్నూల్ నుంచిపటాన్‌చెరుకు, ఎన్ రఘునాథ్‌రెడ్డి ఎన్‌ఫోర్స్ మ.నగర్ నారాయణఖేడ్‌కు, కె ఏడుకొండలు నాగర్‌కర్నూల్ నుంచి మల్కాజిగిరికి, జి ఏడుకొండలు కొల్లాపూర్ నుంచి ఏసి హైదరాబాద్ కు, బి కవిత నారాయణపేట నుంచి సంగారెడ్డికి బదిలీ అయ్యారు.

జడ్పీ సీఈవో, డీఆర్‌డీవోల ట్రాన్స్‌ఫర్

» వారి స్థానంలో కొత్తవారి నియామకం



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జడ్పీ సీఈవో, డీఆర్‌డీవో, డీపీవో, డిప్యూటీ సీఈవోలు బదిలీలు అయ్యారు. వారి స్థానంలో నూతన అధికారులను నియమించారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిది. మహబూబ్‌నగర్ జడ్పీ సీఈవోగా పని చేస్తున్న ఎం.జ్యోతి సంగారెడ్డి డీఆర్‌డీవోగా బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ సీఈవోగా బీ రాఘవేంద్రరావు నియమితులయ్యారు. నాగర్‌కర్నూల్ జడ్పీ సీఈవో బి ఉష నిజామాబాద్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో దేవ సహాయం రానున్నారు. మహబూబ్‌నగర్ డీఆర్‌డీవో యాదయ్య వనపర్తి జడ్పీ సీఈఓగా, నాగర్‌కర్నూల్ డీఆర్‌డీవో బి నర్సింగ్‌రావు జోగుళాంబ డీఆర్‌డీవోగా బదిలీ అయ్యారు. నారాయణపేట డిప్యూటీ సీఈవో గోపాల్ నాగర్‌కర్నూల్ డిప్యూటీ సీఈవోగా, వనపర్తి డీఆర్‌డీవో పి నర్సింహులు మహబూబ్‌నగర్ డీఆర్‌డీవోగా, జోగుళాంబ డీఆర్‌డీవో ఉమాదేవి వనపర్తి డీఆర్‌డీవోగా, నాగర్‌కర్నూల్ అడిషినల్ డీఆర్‌డీవోగా పని చేస్తున్న బి రాజేశ్వరి నారాయణపేట డీఆర్‌డీవోగా నియమితులయ్యారు. నారాయణపేట డీపీవో కాశ మురళి నల్గొండ డీపీవోగా, వనపర్తి డీపీవో సురేశ్‌కుమార్ సూర్యపేట డీపీవోగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

వైభవంగా పాలెం వెంకన్న ధ్వజారోహణ, గరుడ పూజలు



పాలెం వెంకన్న ఆలయంలో గరుడు వాహన సేవలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 12 : అలమేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ధ్వజారోహణం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, స్వామి వారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కొరవి రామానుజార్యులు తెలిపారు. మండలంలోని పాలెంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గరుడ స్వామిని పూజించారు. గరుడ ప్రసాద వితరణ చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా రచ్చకట్ట వరకు భక్తుల భజనలు, కీర్తలతో భక్తిపారవశ్యంతో సాగింది. మూడో రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తులిసి అర్చనతో పాటు సుప్రభాత పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సీహెచ్ రంగారావు తెలిపారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఛైర్మన్ జున్న శేఖర్ రెడ్డి తెలిపారు.

నేపాల్‌లో జరిగే వరల్డ్ సోషల్ ఫోరం సదస్సుకు చెవ్వ రఘుపతి రావు ఎంపిక



అమ్రాబాద్, ఫిబ్రవరి 12: నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి గ్రామానికి చెందిన చెవ్వ రఘుపతిరావు ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 19 వరకు నేపాల్ రాజధాని ఖాట్మండు నగరంలో నిర్వహించే వరల్డ్ సోషల్ ఫోరం సదస్సుకు ఎంపికయ్యారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని మరో ఇద్దరి వ్యక్తులతో కలిసి రఘుపతిరావు ఈ సదస్సుకుహాజరు కానున్నారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన చర్చించనున్నారు. వరల్డ్ సోషల్ ఫోరం సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించిన యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులకు రఘుపతి రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన రఘుపతి రావు ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ వరల్డ్ సోషల్ ఫోరం సదస్సుకు హాజరు కానుండడంతో నల్లమల ప్రాంతానికి చెందిన ఆయన మిత్రులు, బంధువులు అభినందనలు తెలిపారు.

వీరజవాన్ యాదయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం



యాదయ్య భార్యను సన్మానిస్తున్న కేవీఎన్‌రెడ్డి

వంగూరు, ఫిబ్రవరి 12: నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీర జవాన్ మల్లెపాకుల యాదయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొండారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడు తూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన యాదయ్య కుటుంబాన్ని గత ప్రభుత్వాలు ఆదుకోవడంతో నిర్లక్షం వమించారని విమరించారు. యాదయ్య కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఆ కుటుంబం నిరాశకు గురైందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదయ్య కుటుంబాన్ని గుర్తించి యాదయ్య భార్య సుమతమ్మకు చారకొండ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకొన్నారని అన్నారు. అదేవిధంగా గ్రామంలో రూ. 15 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణం పనులు జరుగుతు న్నాయని పేర్కొన్నారు. వేమారెడ్డి, మురళి, రాము, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను గోడ కుర్చీ వేయించిన టీచర్‌పై తల్లిదండ్రుల ఆగ్రహం



చికిత్స అనంతరం హాస్పిటల్ వద్ద విద్యార్థులు

కోడేరు, ఫిబ్రవరి 12 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మం డల కేంద్రంలోని బా లుర, బాలికల ప్రా థమిక పాఠశాలలో విద్యార్థులను ఉపా ధ్యాయుడు గోడ కు ర్చీ వేయించడంతో విషయం తెలుసుకు న్న తల్లిదండ్రులు ఉపాధ్యాయునిపై సోమవారం పాఠశాలకు వెళ్లి మందలించారు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రామచంద్ర య్య 4వ తరగతి విద్యార్థులకు హోంవర్కు ఇచ్చారు. విద్యార్థులు కొందరు చేయకుండా పాఠశాలకు రావడంతో నోట్‌బుక్కును చెక్ చేసి హోంవర్క్ ఎందుకు చేయలేదని పది మంది విద్యార్థులను గోడకుర్చీ వేయించారు. కొంత సమయం తర్వాత వదిలేశారు.

దీంతో విద్యార్థులు బాగా అలసిపోయి నడవలేని పరిస్థితి వచ్చి పడడంతో విషయం మాకు తెలిసిందని తల్లిదండ్రులు తెలిపారు. ఉపాధ్యాయున్ని వివరణ కోరగా.. విద్యార్థులను కొట్ట లేదు, తిట్టలేదు.. కొద్ది భయం ఉండాలని వారి కోసమే అలా చేశానన్నారు. రెండు నిమిషా లు మాత్రమే ఉంచానన్నారు. ఈ విషయం హెడ్‌మాస్టర్‌ను వివరణ కోరగా డీఈవో దృష్టికి తీసుకుపోతామన్నారు.

జాతీయ పక్షి మృతి

పెద్దమందడి, ఫిబ్రవరి 12 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామ శివారు ప్రాంతంలో జాతీయ పక్షి నెమలి మరణించింది. గ్రామస్థులు అం దించిన సమాచారం మేరకు ఫారెస్టు అ ధికారి నరేష్ సోమవారం ఘటనా స్థలా నికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదవశాత్తు ముళ్ల పొదలో చిక్కుకొని మృతి చెందిం దని ఆయన తెలిపారు. నెమలి ఒంటిపై గాయాలు గాని, విషాహారం తిన్నట్లు ఎలాంటి లక్షణాలు కనిపించలేదని తెలిపారు. పంచనామా చేసి జాతీయ పక్షిని ఖననం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నరేష్‌కుమార్, ఎఫ్‌బీవో నాగేంద్ర, స్థానికుడు ముచ్చర్ల శివ తదితరులున్నారు.

'టెండర్ల కంటే అదనంగా రూ.200 ఇచ్చాం'

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 12: ఆదివారం వ్యవసాయ మార్కెట్‌లో వేసిన టెండర్లను కొన్ని కారణాల వల్ల రద్దు చేశామని.. తిరిగి సోమవారం ఆ టెండర్లకే అదనంగా రూ.200 ఇస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ జిల్లా అధికారిణి బాలమణి తెలిపారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు అదే టెండర్లపై రూ.200 చెల్లించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యం నాణ్యతను బట్టి ధర నిర్ణయించడం జరుగుతుందన్నారు. డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ రవీందర్, ఎస్సై రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

నవాబ్‌పేట, ఫిబ్రవరి 12: ఇల్లు కట్టుకునేందుకు తీసుకువచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఓ యువకుడు ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని అమ్మాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం ఎస్‌ఐ అభిషేక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టంకసాల గీతమ్మ కుమారుడు వెంకట నర్సింహచారి (27) కొంత కాలం క్రితం గ్రామంలో ఇళ్లు కట్టుకునేందుకు తన బంధువులు, స్నేహితుల వద్ద సుమారు రూ. పదిలక్షల అప్పులు తీసుకున్నాడు. తీసుకున్న అప్పులు ఎలా చెల్లించాలని నిత్యం బెంగపడేవాడు. దాంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అనుమానంతో ఇరుగు పొరుగువారు తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి జడ్చర్లలో ఉన్న తల్లి గీతమ్మకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 12 : ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని ఎస్పీ యోగేష్ గౌతమ్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఫిర్యాదుదారుల నుంచి ఆరు ఫిర్యాదులు స్వీకరించి, వాటిని చట్ట ప్రకారం పరిశీలించాలని సీఐ, ఎస్‌ఐలను ఆదేశించారు. భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు ఉన్నా కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదు దారులకు ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే డయల్ 100, 1930కి కాల్ చేసి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

మార్కండేయ స్వామి డోలారోహణం



డోలారోహణంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట, ఫిబ్రవరి 12 : నారాయణపేట భక్త మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం మార్కండేయ స్వామి జయంతి సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో డోలా రోహణం నిర్వహించారు. అంతకుముందు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు డా.క్యాతన్ రఘునాథ్, తాటి నర్సప్ప, రాములు, శ్రీనివాస్, వెంకట రాములు, నరసింహులు, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని కోటకొండ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శిరీష రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. 7వ తరగతికి చెందిన శిరీష కొత్తగూడెంలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎదిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం రవికుమార్, పీఈటీ రమణ, ఉపాధ్యాయులు ఆమెను అభినందిస్తూ ధ్రువపత్రం అందజేశారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



అభివాదం తెలుపుతున్న నాయకులు

నారాయణపేట, ఫిబ్రవరి 12 : కేంద్ర ప్రభుత్వం అవ లంబిస్తున్న కార్మికుల, రైతుల కు నష్టం కలిగించే విధానా లను నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని మెట్రో ఫంక్షన్ హాల్‌లో రైతు కార్మిక సదస్సు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వెంకట్రామ్‌రెడ్డి, బాల్‌రామ్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని తదితర డిమాండ్లతో ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

నారాయణపేట, ఫిబ్రవరి 12 : నారాయణపేట సీఐ భగవంత్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి, ఎండీ గౌస్, సలీం, మహీనుద్దిన్, శంకర్, శరణప్ప, ఖలీల్ పాల్గొన్నారు.

సమ్మె కరపత్రాలు, క్యాలెండర్ విడుదల

నారాయణపేట వైద్యవిభాగం, ఫిబ్రవరి 12 : తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ సంఘం ఏఐటీయూసీ అనుబంధం ఆధ్వర్యంలో నాయకులు కొండన్న, వెంకటేష్, కార్మికులు సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో దేశ వ్యాప్తంగా ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మె కర పత్రాలు, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని ఉద్యోగ, కార్మిక వర్గం ఈ సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్, నరసింహ, ప్రవీణ్, చిరంజీవి, యాదేశ్, అరుణ, శ్రీను, మహేశ్వరి, సత్యమ్మ పాల్గొన్నారు.

రేపు వీరజవాన్‌ల దినోత్సవం

మక్తల్, ఫిబ్రవరి 12 : ఈనెల 14న వీరజవాన్‌ల దినోత్సవం జరుపుకుందాం అని బజరంగదళ్ ప్రఖండ సంయోజక్ పస్పుల భీమేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో బజరంగదళ్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం రోజు అమరవీరుల దినోత్సవం జరుపుకుందామన్నారు. దేశం కోసం వీర మరణం పొందిన జవాన్‌ల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, బజరంగదళ్ నాయకులు రాహుల్, శ్రీనివాసులు, నరేష్, మల్లికార్జున్, తోక హన్మంతు, మూర్తి, అక్షయ్, నాగరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

కోస్గి రూరల్, ఫిబ్రవరి 12 : కోస్గి పట్టణంలో ప్రభుత్వ భూములను అధికారులు సర్వే చేశారు. సోమవారం పట్టణంలోని దేవాదాయ శాఖ ప్రభుత్వ భూమి 1737, 1805, 1808, 1809, 1811, 1812 సర్వే నంబర్లలో గల భూమితో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమిని సర్వే చేశారు. నేడు కూడా సర్వే చేసి హద్దు రాళ్లు పాతుతామని అందుకు పోలీసుల రక్షణ కావాలని తహసీల్దార్ శ్రీనివాస్ ఎస్‌ఐ శేఖర్‌గౌడ్‌ను కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శశీధర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నర్వ ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలో సోమవారం సీజన్ 3 ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నీని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బంగ్ల లక్ష్మీకాంతారెడ్డి ప్రారంభించారు. ఈ టోర్నీలో 49 టీంలు పాల్గొనగా, మొదటి ప్రైజ్ మనీ దాత బంగ్ల లక్ష్మీకాంతారెడ్డి రూ.60 వేలు, రెండో ప్రైజ్ మని దాతగా టీపీఎస్ చెన్నయ్య సాగర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, అన్ని టీంలకు డ్రెస్ కోడ్ దాతగా ప్రతిభా స్కూల్ కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి సహకారం అందించారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు దండు అయ్యప్ప, శంకర్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శరణప్ప, ఎంపీటీసీ సభ్యుడు నీరజ్, అయ్యన్న, నిర్వాహకులు కిష్టారెడ్డి, నరసింహ, మల్లేష్ పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలకు రూ.లక్ష విరాళం

నర్వ, ఫిబ్రవరి 12 : మండలంలోని రాంపూర్ మఠం వద్ద ఈనెల 24 నుంచి జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే బండలాగుడు పోటీలకు బీఆర్‌ఎస్ మండల నాయకుడు దండు అయ్యప్ప సోమవారం లక్షా నూటపదహారు రూపాలయలు నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలొ నర్సింహులు గౌడ్, కర్ణాకర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

వచ్చేనెల 9న జాతీయ లోక్ అదాలత్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 12 : నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చేనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ తెలిపారు. సోమవారం కోర్టులో సమావేశంలో మాట్లాడారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కేసులు త్వరగా పరిష్కారమై త్వరగా న్యాయ మందుతుందని, తమ కేసులను రాజీ కుదుర్చు కోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక కార్యాచరణ

రూపొందించాలి

▸▸ ఉపాధ్యాయుల సమావేశంలో డీఈవో అబ్దుల్ ఘనీ



డీఈవో చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

కోస్గి రూరల్, ఫిబ్రవరి 12 : ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చదువుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని డీఈవో అబ్దుల్ ఘనీ అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో డీఈవో మాట్లాడారు. నేటి నుంచి 40 రోజుల పాటు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరు ధారాళంగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం, సొంత మాటల్లో రాయడం వంటి సామర్థ్యాలను ఉద్దేశించి ప్రత్యేక కార్యాచరణకు ప్రణాళికను అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖలో వివరాలు సేకరించేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని డీఈవో తెలిపారు. ప్రాథమిక స్థాయిలో ఐదవ తరగతి వరకు అందరూ విద్యార్థులు తరగతి స్థాయి సామర్థ్యాలు సాధిస్తూనే ధారాళంగా చదవడం వచ్చినప్పుడే వారికి నేర్చుకోవడంపై ఆసక్తి కలుగుతుందని అన్నారు. నలభై రోజులు ఉపాధ్యాయులు కష్టపడితే ఇది సాధ్యం అవుతోందన్నారు. అభ్యాసన మిత్ర పేరుతో రూపొందించిన కార్యక్రమానికి ముగింపు పలకాలంటే విద్యా సంవత్సరం పూర్తయ్యేలోపు పాఠశాలలోని విద్యార్థులందరూ చదవగలుగుతారు అనే సామర్థ్యాన్ని సాధించారని అలా ప్రతీ పాఠశాల ప్రకటించే స్థాయికి రావాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతుల నేపథ్యంలో వారికి అల్పాహారం నిమిత్తం బాలాజీ ఆసుపత్రి వారు బిస్కెట్లు అందజేశారు. జిల్లా మానిటరింగ్ అధికారి విద్యాసాగర్, డీఆర్‌వో వీరమల్లేష్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నారాయణపేట, ఫిబ్రవరి 12 : ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు నీరు ఇవ్వకుండా ద్రోహం చేసిన కేసీఆర్ కృష్ణా జలాలపై నల్గొండలో బహిరంగ సభ నిర్వహించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సోమవారం కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్ ఆధ్వర్యంలో పేట సత్యనారాయణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి, మాట్లాడారు. కృష్ణా జలాలపై కేసీఆర్ మాట్లాడుతున్న తీరు చూస్తే దొంగే దొంగ అన్నట్లు ఉందన్నారు. కేసీఆర్ గత పదేళ్లలో పాలమూరు ప్రాజెక్టుపై వివక్ష చూపి ఇప్పుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 40శాతం కూడా పూర్తి కాలేదని, కృష్ణా జలాలను అక్రమంగా ఆంధ్రాకు దోచిపెట్టారని, పాలమూరు జిల్లాకు సాగు నీరు ఇవ్వకుండా అన్యాయం చేశారని, నేడు కృష్ణా జలాలు అందడడం లేదని సిగ్గు లేకుండా బహిరంగ సభ పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 60 రోజుల్లోనే పేట - కొడంగల్ ఎత్తిపోతలకు నిధులు కేటాయించడం నిబద్ధతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి, సలీం, మనోహర్ ప్రసాద్, లిఖి రఘు, కల్యాణ్, నర్సిములు, రవి, శంకర్, నర్సిములు గౌడ్, యూసూఫ్ పాల్గొన్నారు.

● నర్వ : మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా నీళ్లు, నిధులు నియామకాల పేరుతో పరిపాలన చేసిన కేసీఆర్‌ను ప్రజలు ఓడగొట్టడంతో మతి భ్రమించి ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంగ్ల లక్ష్మీకాంతారెడ్డి, చెన్నయ్య సాగర్, కృష్ణారెడ్డి, నీరజ్, శ్రీనివాస్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యప్ప రెడ్డి, కట్ట రాములు పాల్గొన్నారు

ఆలయ భూములు కాపాడాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వీహెచ్‌పీ, బజరంగదళ్ నాయకులు

మక్తల్, ఫిబ్రవరి 12 : పడమటి ఆంజనేయస్వామి భూములు కాపాడాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ సువర్ణరాజుకు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, బజరంగదళ్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సర్వే నెం. 35లో 8.24 ఎకరాలు ఉందన్నారు. అలాగే సర్వే నెం.34ను సర్వే చేసిన తర్వాత 35 సర్వే నెంబరులో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కోట్ల రూపాయల విలువైన భూములు జాతీయ రహదారి, ఆలయం పరిసరాల్లో ఉన్నట్లు తెలిపారు. వెంటనే ఆలయ భూములు కాపాడాలన్నారు. కార్యక్రమంలో హిందూ ధార్మిక సంఘాల నాయకులు, భీంరెడ్డి, సత్యనారాయణ, కావలి వెంకటేష్ పాల్గొన్నారు.

గవినోళ్ల శ్రీనివాస్‌ను అభినందించిన సీఎం

నారాయణపేట, ఫిబ్రవరి 12 : రాష్ట్ర అసెంబ్లీలో కృష్ణా జలాల పరిరక్షణ, కృష్ణా జలాల అక్రమ తరలింపును వ్యతిరేకించి ఏపీ ప్రభుత్వంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసి అక్రమ నీటి తరలింపును కోర్టు స్టే ద్వారా ఆపారు. ఈ విషయమై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ద్వారా గవినోళ్ల శ్రీనివాస్ చేసిన పోరాటాన్ని వివరించారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి కృష్ణా జలాలను పోతిరెడ్డి పాడు ద్వారా తరలింపును ఆపి దక్షిణ తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడిన శ్రీనివాస్‌ను, నియోజక వర్గ రైతులు, నాయకులు శంకర్‌గౌడ్, సుభాష్, రాంరెడ్డి, భాస్కర్, నాగయ్య, అశోక్‌ను మంత్రి ఉత్తమ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవోకు సన్మానం



ఊట్కూర్‌లో ఎంపీడీవోను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఊట్కూర్, ఫిబ్రవరి 12 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఊట్కూర్ ఎంపీడీఓ రమేష్‌కుమార్ గద్వాల జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో కలిసి స్నేహపూర్వకంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతనం పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వై.నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఏంపీవో ఎంఎల్ ఎన్ రాజు, సూపరింటెండెంట్ కొండన్న, ఏపీవో సత్యప్రకాష్, ఈసీ మహిపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేందర్



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు సురేందర్

మక్తల్/కృష్ణ, ఫిబ్రవరి 12 : మక్తల్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు సురేందర్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 7వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సైన్స్ అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ కార్యదర్శి డాక్టర్ సుబ్రమణ్యం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సాహిత్యాన్ని, బహుజన సాహిత్యం ముందుకు తీసుకెళ్లడం కోసం ప్రతీ ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థల వారికి అవార్డు అందిస్తున్నట్లు తెలిపారు. సౌత్ ఇండియాలోని ఆరు రాష్ట్రాలు అయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి ఈ అవార్డును ఎంపిక చేశారన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న సురేందర్ కృష్ణ మండలం కుస్సీ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. గత నలభై సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గతంలో అవార్డులు అందకున్నారు. జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడంతో పలువురు అభినందించారు.

రాంకుల కుంట ఆక్రమణ

▸▸ ప్రభుత్వానికి అమ్మకందారే కబ్జా

▸▸ పట్టించుకోని అధికారులు ▸▸ కుంటను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



కుంటను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కోస్గి రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని బొలవోనిపల్లి గ్రామ శివారులోని రాంకుల కుంటను ప్రభుత్వానికి అమ్మిన వ్యక్తులే ఆక్రమించుకున్నారు. పదేపదే గ్రామస్థులు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదు. గ్రామ శివారులోని 463, 464, 465, 467, 403లో మొత్తం సుమారు 19 ఎకరాల భూమిని ప్రభుత్వం 1989-90లో ఇరిగేషన్ శాఖ రాంకులకుంట ఏర్పాటుకు కొనుగోలు చేసింది. అప్పట్లో మార్కెట్ ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రొసిడింగ్‌లను ఇరిగేషన్ శాఖకు అప్పగించింది. కానీ అప్పటి నుంచి అక్కడ తాత్కాలికంగా ఓ కట్ట వేశారు తప్ప ఆ భూమిని పట్టాదారు నుంచి ప్రభుత్వం తీసుకోలేదు. దీనికి కట్ట అలుగు, తూము ఉన్నప్పటికీ అటువైపు ఏ అధికారి వెళ్లలేదు. రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు చెప్పినా తమకేమి తెలియదన్నట్లుగా ఉండిపోయారు. దీంతో రైతులు కట్టను కూడా తెంచారు. దీంతో కట్ట కింద ఉన్న రైతుల పంటలు వర్షా కాలంలో మునిగిపోతున్నాయి. కుంటలో మాత్రం అమ్మకం దారే పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ విషయంపై ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందేమోనని గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఇరిగేషన్ అధికారులు కుంటను తనిఖీ చేశారు. తమ రికార్డులలో ఈ కుంట ఉందని, అక్కడి కుంటలో సాగు చేసిన రైతు గోపాల్‌రెడ్డిని అడగగా అవును సార్ మేము అమ్మిన విషయం వాస్తవమని ఒప్పుకున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇప్పటికైనా ఈ కుంటను అధికారులు సర్వే చేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం కాకుండా చేస్తారో? లేదో వేచి చూడాలి.

ప్రభుత్వం కొనుగోలు చేసిన ప్రొసిడింగ్స్ ఉన్నాయి

ప్రభుత్వం 1989-90 సంవత్సరంలో రాంకుల కుంట ఏర్పాటుకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసింది. అందుకు సంబంధించిన ప్రొసిడింగ్స్ మా దగ్గర ఉన్నాయి. కాని ఇక్కడ అమ్మకం దారులే సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి మాకు అప్పగిస్తే మేము కుంటను ఏర్పాటు చేస్తాం.

- ఆనంద్‌కిషోర్, డీఈ, ఇరిగేషన్

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 12 : నారాయణపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు వాహనాలు, రెండు బైకులకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేట రూరల్ ఎస్‌ఐగా పి.కృష్ణదేవ్



ఎస్‌ఐ కృష్ణదేవ్

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 12 : పేట రూరల్ ఎస్‌ఐగా పి.కృష్ణదేవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన జయప్రసాద్ మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కృష్ణదేవ్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షిస్తూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు.

ఎంపీ స్థానం బీసీలకే ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

నారాయణపేట, ఫిబ్రవరి 12 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం బీజేపీ పార్టీ బీసీలకే కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్ల నర్సిములు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో బీసీలు అధికంగా ఉన్నారని, ఎంపీ టికెట్ బీసీ అభ్యర్థికి కేటాయిస్తే బీసీలు ఏకతాటిపైకి వచ్చి గెలిపించు కుంటారని ధీమా వ్యక్తం చేశారు. లేకుంటే బీజేపీ జిల్లా, రాష్ట్ర కార్యాలయాల ముందు ధర్నా చేస్తామన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాల్‌చందర్, సంగప్ప, బాల్‌రాజ్, ఆశప్ప పాల్గొన్నారు.

నేడు ఓపెన్ టు ఆల్ తాడు లాగుడు పోటీలు

మక్తల్, ఫిబ్రవరి 12 : సరోజినీ నాయుడు, జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టగ్‌ఆఫ్‌వార్, సైక్లింగ్, షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ తాడు లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సైక్లింగ్ జిల్లా అధ్యక్షుడు థాన్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం అన్నారు. సోమవారం మక్తల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మక్తల్ మినీ స్టేడియంలో మహిళలు, బాలికలకు తాడు లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ జట్టులో ఎనిమిది మంది బాలికలు ఉండాలన్నారు. పోటీలో రెండు జట్ల బరువు సమానంగా ఉండాలన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. పీఈటీలు రమేష్‌కుమార్, అంబ్రేష్ పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్



బోరుకు పూజలు చేస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని ఎక్లాస్‌పూర్ జాతర సందర్భంగా జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సొంత నిధులతో సోమవారం బోరును వేయించారు. బోరులో నీరు మూడు ఇంచులతో పుష్కలంగా పడటంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సదాశివారెడ్డి, భాస్కర్ రెడ్డి, ఊశప్ప, ఎండీ గౌస్, రాములు, సాయిరెడ్డి, అర్చకుడు మాణిక్ శాస్త్రి పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 12 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ధాన్యం విక్రయాల జోరు కొనసాగింది. వేరు శనగ 1,557 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,652, కనిష్ఠంగా రూ.4,112, రమారమిగా రూ.6,570 పలికింది. జొన్నలు తొమ్మిది క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠ, కనిష్ఠంగా రూ.3,811, అలసందలు క్వింటాలు రాగా, గరిష్ఠ, కనిష్ఠంగా రూ.7,601, తెల్ల కుసుమలు క్వింటాలు రాగా, ధర గరిష్ఠ, కనిష్ఠంగా రూ.4,025, ఎర్ర కందులు 93 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.10,390, కనిష్ఠంగా రూ.6,052, రమారమిగా రూ.10,390, తెల్ల కందులు 22 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.11,000, కనిష్ఠంగా రూ.9,909 పలికింది.

మహిళ ఆత్మహత్యాయత్నం

కృష్ణ, ఫిబ్రవరి 12 : రైల్వే బ్రిడ్జిపై నుంచి దూకి ఓ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హిందూపురం గ్రామానికి చెందిన గడ్డం అయ్యన్న కూతురు నింగమ్మ సైదాపూర్‌కు అత్తగారి ఊరి నుంచి సోమవారం సాయంత్రం రైలులో కృష్ణకు చేరుకుంది. ఈ క్రమంలో కుటుంబ కలహాలతో బాధపడుతూ రైల్వే బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో నింగమ్మ కాలికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

రెండు దుకాణాల్లో చోరీ

కోస్గి రూరల్, ఫిబ్రవరి 12 : వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు బెంబేలెత్తి భయపడుతున్నారు. ముఖ్యంగా వ్యాపారస్తులు తమ దుకాణాల్లో ఉదయం వచ్చేసరికి ఏమైన జరుగుతుందేమో అన్న భయంలో ఉన్నారు. పోలీసుల పహారా ఎక్కడ కూడా కనబడకపోవడం ఇందుకు కారణం. పెట్రోలింగ్ చేయాల్సిన పోలీసులు తమకేమీ తెలియదన్నట్లుగా పడుకుంటున్నారు. ఆదివారం రాత్రి కోస్గి నుంచి తాండూర్ వెళ్లే దారిలో పోలీస్టేషన్‌కు కూతవేటు దూరంలో రాజు హోల్‌సెల్ దుకాణంలో వెనకాల నుంచి రేకులను కట్ చేసి, విలువైన సరుకులను ఎత్తుకెళ్లారు. అదే క్రమంలో విద్యుత్ కార్యాలయం ముందు గల మణికంఠ కిరాణ కొట్టులో కూడా రేకులను కట్ చేసి సామగ్రి ఎత్తుకెళ్లారు. కాగా రెండు రోజులుగా ఇక్కడున్న ఎస్‌హెచ్‌వో బదిలీ అయ్యారని, తనకేమి తెలియదన్నట్లు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై దుకాణ దారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇంకా కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 12 : విద్యార్థులు పది పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. పదిలో విద్యార్థులు ఫలితాలను మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కలెక్టర్ కొనియాడుతూ అభినందించారు. సమీక్షలో డీఈవో అబ్దుల్ ఘనీ పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోలను కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కలెక్టర్ శ్రీహర్ష సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, జడ్పీ డిప్యూటీ సీఈవో జ్యోతి పాల్గొన్నారు.